

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - బద్వేలు

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు తమ పాఠశాల విద్యార్థులు అర్హత సాధించిందని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని షేక్ జాస్మిన్ శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ హైజంప్ పోటీలలో రెండవ స్థానం సాధించి జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత సాధించిందని చెప్పారు. 8వ తరగతి చదువుతున్న దాదాపీర్ అనే విద్యార్థి డిస్కస్ త్రోలో నాలుగవ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు ఆర్. సుబ్బారావు, కె. కొండయ్య, ఆర్. వెంకటరమణ, ఎస్. బాలయ్య, ఎస్. నాగరాజారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.


జిఎన్ఎస్ఎస్ పనులకు మోక్షమెప్పుడో?



- 'ముదివేడు' నిర్వాసితులకు పరిహారమేదీ
- జ్యూస్ పరిశ్రమల ఏర్పాటుకు నిరీక్షణ
- కదలికలేని కడప-రేణిగుంట రహదారి పనులు
- నేడు చిన్నమండెంకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

అన్నమయ్య జిల్లా పెండింగ్ సమస్యలకు నిలయంగా మారింది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2, హంద్రీ-నీవా సాగునీటి ప్రాజెక్టు పనులు దగ్గర నుంచి జాతీయ రహదారుల నిర్మాణాలు, నిర్వాసితులకు పరిహారం, వందలాది ఎకరాల భూకబ్జాలు, పారిశ్రామిక ప్రగతి తిరోగమన సమస్యలతో సతమతమవుతోంది. రాష్ట్రంలోనే కరువు మండలాలకు అన్నమయ్య జిల్లా నిలయం. దుర్భిక్ష ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు పాలకులు చొరవ తీసుకోవాల్సి ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండల పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్న నేపథ్యంలో కథనం...





ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా పురోగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న సామెత చందంగా మారింది. రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా ఉద్యాన పంటల సాగులో అగ్రపీఠిన నిలుస్తోంది. జిల్లాలో మామిడి, అరటి తోటలు ప్రకృతి వైపరీత్యాతోటలు బారిన పడిన సంగతి తెలిసిందే. మామిడి పూత పూయడం లేదు. ఫలితంగా తోటలపై గొడ్డలి వేటు పడుతోంది. ఉద్యాన నిపుణుల సహకారం తీసుకుని సమస్యను అధిగమించ డానికి పాలకులు కృషి చేయాల్సి ఉంది. ఉద్యాన పంటలకు నిలయమైన రైల్వేకోడూరులో పండ్ల రసాల పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలుకు ఆమడదూరంలో నిలిచింది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల్లో ఎటువంటి పురోగతీ కనిపించడం లేదు. రూ.ఐదు వేల కోట్లతో కూడిన కాలేటివాగు రిజర్వాయర్ నిలిచిపోయింది. ఫలితంగా రాయచోటి, చక్రాయపేట మండలాల్లో సుమారు 72 చెరువులకు జలకళ ప్రశ్నార్థకంగా మారింది.

ఉద్యాన యూనివర్శిటీకి మోక్షమేదీ

రాజంపేట నియోజకవర్గ పరిధిలో 200 ఎకరాల్లో ఉద్యాన యూనివర్శిటీ ఏర్పాటు హామీ అమలుకు నోచుకోవడం లేదు. 2014-2015 టిడిపి హయాంలో చేసిన ప్రయత్నం వెలవెలబోతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఉద్యాన యూనివర్శిటీ ఏర్పాటుకు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జ్యూస్ పరిశ్రమ హామీ ఏమైంది

రాష్ట్రంలోనే ఉద్యాన పంటల సాగులో అన్నమయ్య జిల్లా అగ్రపీఠిన నిలుస్తోంది. మామిడి, అరటి, తోటలు సహా ఇతర పంటల సాగుకు అవసరమైన నర్సరీలతో కళకళ లాడుతోంది. ఉద్యాన పంటలకు నిలయమైన ప్రాంతంలో పండ్ల రసాల పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ వెలవెలబోతోంది.

పడకేసిన సాగునీటి ప్రాజెక్టులు

జిల్లాలోని ప్రాజెక్టు పనుల పురోగతి ప్రశ్నార్థకంగా మారింది. జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులకు కదలిక ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. 2014 ఫిబ్రవరిలో ఫేజ్-2 పనులకు పిలిచిన టెండర్లు రద్దుకు గురైనప్పటి నుంచి ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. ఫేజ్-2లో భాగమైన జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ పనులు ఎప్పటికి సాకారమవుతాయో తెలియడం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, ముదివేడు, ఝరికోన రిజర్వాయర్ పనుల్లో ఎటువంటి పురోగతి లేదు. వెలిగల్లు ఎత్తిపోతల పథకం పనులకు మోక్షమెప్పుడో తెలియడం లేదు. ముదివేడు నిర్వాసితులు పరిహారం కోసం నిరీక్షిస్తున్నారు.

పట్టాలెక్కని జాతీయ రహదారులు

కడప-రేణిగుంట రహదారిసర్వే దశను దాటని పరిస్థితి నెలకొంది. కడప-తిరుపతి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి సర్వే దశను దాటడం లేదు. అన్నమయ్య, బెంగళూరు-విజయవాడ ఎన్‌హెచ్ నిర్వాసితులకు వేదన తప్పడం లేదు. 15 ఏళ్లుగా గ్రీవెన్స్‌సెల్, స్పందన, ప్రజా సమస్యల పరిష్కార వేదికల చుట్టూ తిరుగుతున్నప్పటికీ పరిష్కారం కావడం లేదు. అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ ఎప్పటికి సాకారమవుతుందో తెలియడం లేదు. రాయచోటి-వేంపల్లి-చాగలమర్రి, బెంగళూరు-విజయవాడ జాతీయ రహదారుల నిర్మాణానికి భూములు కోల్పోయిన నిర్వాసితులకు వెతలు తప్పడం లేదు.

సిఎం పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు : ఎస్‌పి

ప్రజాశక్తి- కడప అర్బన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిన్నమండెం పర్యటన నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు నచికేత్ విశ్వనాథ తెలిపారు. మంగళవారం విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఈ నెల 12న ముఖ్యమంత్రి అన్నమయ్య జిల్లా చిన్నమండెం పర్యటన నేపథ్యంలో ఎయిర్ పోర్ట్‌లో చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లపై పోలీసు శాఖ, ఇతర శాఖల అధికారులతో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పొద్దార్, వైద్య, విద్యుత్, అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమం, సంపద సృష్టే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత



పరిశ్రమలకు శంకుస్థాపన చేస్తున్న ఇన్‌ఛార్జి మంత్రి సవిత

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగిస్తూ స్థానిక వనరులతో సంపదను సృష్టించే ప్రణాళికలు, ముందుచూపుతో ముఖ్యమంత్రి ముందుకు వెళుతున్నారని జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర బిసి సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. మంగళవారం 'పరిశ్రమలు - ఉపాధి కల్పన'లో భాగంగా ప్రకాశం జిల్లా కనిగిరి పరిధిలోని పెదఈర్లపాడులో ఎంఎస్ఎంఇ పార్కుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాలలోని 50 ఎంఎస్ఎంఇ పార్కులకు ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వర్చువల్ విధానంలో వీక్షిస్తూ.. స్థానిక కలెక్టరేట్ సభాభవన్ నుంచి కడప జిల్లాలో రూ.4,322 కోట్ల పెట్టుబడులతో 1179.64 ఎకరాల్లో 7 పరిశ్రమల యూనిట్‌లకు శంకుస్థాపనలు చేసే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత, కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరిలతో పాటు ప్రభుత్వ విప్‌లు ఆదినారాయణ రెడ్డి, ఆర్.మాధవి, కమలాపురం శాసన సభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రసాద రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా అడుగులేస్తున్న ప్రభుత్వం మనది అన్నారు. జిల్లాలోని ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటుకు శిలాఫలకాలు ఆవిష్కరించారని చెప్పారు. వచ్చే సంవత్సరంలోగా ఆయా పార్కుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను సమకూర్చి స్థానిక ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు యూనిట్లు నెలకొల్పుకునే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేకించి వైఎస్ఆర్ కడప జిల్లాకు అపారమైన సహజ వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒక వైపు పారిశ్రామికంగా, మరోవైపు వ్యవసాయ ఉద్యాన పరంగా అపారమైన ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. కడప జిల్లాను భవిష్యత్తులో మరింత అభివృద్ధి వైపు నడిపించేందుకుచేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటికే జిల్లాలో పారిశ్రామిక విప్లవం మొదలైందన్నారు. పలు భారీ పరిశ్రమలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో త్వరలోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందనున్నాయన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంచి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లాలో ఎపిఐఐసికి సంబంధించి రూ.4,322 కోట్ల పెట్టుబడులతో 1179.64 ఎకరాల్లో 7 పరిశ్రమల యూనిట్‌లకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న కొప్పర్తి పారిశ్రామిక వాడను రాష్ట్రంలోనే మోడల్ ఇండస్ట్రియల్ పార్కుగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం కృషిచేస్తోందన్నారు. ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన కంపెనీలు కొప్పర్తి పారిశ్రామిక వాడలో రూపుదిద్దుకుంటున్నాయనిచెప్పారు. భవిష్యత్తులో జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధిలోకి రానుందని తెలిపారు. జిల్లాలోని యూసిఐఎల్ రాష్ట్రానికి ప్రధాన అణుశక్తి వనరుగా ఉపాధికి ఊతంగా వెలుగొందుతోందన్నారు. జిల్లాలో నాపరాయి పరిశ్రమతో పాటు.. అత్యంత ప్రసిద్ధమైన సిమెంట్ కర్మాగారాలు మెగా ఉత్పత్తితో.. జిల్లా ఆర్థిక అభివృద్ధిలో కీలకమైనవిగా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు నాయకులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'లో విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టాలి

డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నాలో ఎస్ఎఫ్ఐ డిమాండ్



ధర్నాలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న శ్రీ చైతన్య విద్యాసంస్థల క్రిమినల్ కేసు నమోదు చేసి, విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని, ఆత్మహత్యలు అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాహుల్ రవి డిమాండ్ చేశారు. మంగళవారం నగర కమిటీ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లాలో శ్రీ చైతన్య విద్యాసంస్థలు పుట్టగొడుగు లాగా పెరుగుతూ చదువు పేరుతో వేలకు వేలు తల్లిదండ్రుల నుంచి రక్తం ఫీజులు వసూలు చేస్తూ ఉన్నారని తెలిపారు. దూర ప్రాంతాల నుంచి చదువు కోసం వచ్చిన విద్యార్థులను ఎక్కువ మార్కులు రావాలని, ఒత్తిడి చేయడం వల్ల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని చెప్పారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ఎలాంటి అనుమతి లేకుండా హాస్టల్ నడిపిస్తూ విద్యార్థుల నుంచి లక్షల రూపాయలు దోపిడీ చేస్తున్నా జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంపై మండిపడ్డారు. కడప నగరంలో 9వ తరగతి చదువుతున్న జస్వంతి అనే అమ్మాయి అనుమానాస్పదంగా మరణించినా విద్యార్థులు తల్లిదండ్రులకు ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు. కడప జిల్లాలో కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అనేకమంది చైతన్య విద్యాసంస్థల్లో విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటున్న వైనం కనబడుతుందని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు కార్పొరేట్ విద్యా సంస్థలకు తొత్తుగా మారి వారిని కాపాడే విధంగా అనుసరించడం దుర్మార్గమని వారన్నారు. ఇప్పటికైనా జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు నిద్ర మత్తులో లేచి చైతన్య విద్యాసంస్థల జరుగుతున్న ఆత్మహత్యలు అరికట్టాలని, విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని, మరణించిన విద్యార్థులకు నష్టపరహారం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు జాల సుమంత్, నగర ఉపాధ్యక్షులు నవీన్, సాయి, అఖిలేష్ పాల్గొన్నారు.

యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి : సిపిఎం

నగరంలోని శ్రీ చైతన్య స్కూల్లో కె-7 లో విద్యార్థి మృతికి కారణమైన యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైతన్య స్కూల్లో హాస్టల్ నిర్వహణకు ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా నిర్వహించటం సమంజసం కాదన్నారు. స్కూల్ గుర్తింపు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి మృతి చెందిన తర్వాత తల్లిదండ్రులకు తప్పుడు సమాచారం ఇవ్వటం, స్కూల్ ఆవరణలోకి వచ్చిన జిల్లా విద్యాశాఖ అధికారులు ఎక్కువసేపు బయట నిలబెట్టడం లాంటి ఘటనలు యాజమాన్య ఆహంకార పూరిత వైఖరికి నిదర్శనమన్నారు. కె-7లో ఉన్న ప్రిన్సిపల్ విద్యార్థుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రిన్సిపల్‌ను చూస్తే పిల్లలు వణికి పోతున్నారని చెప్పారు. అలాంటి ప్రిన్సిపల్ పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. అనేక మంది విద్యార్థులు ఉన్న సంస్థలో వైద్యులు, అత్యవసర వాహనాలు అందుబాటులో లేవన్నారు. స్కూల్ యాజమాన్యం తీరు మారకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి, నరసింహ పాల్గొన్నారు.

విద్యతోనే పేదరికం దూరం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

అందరూ విద్యావంతులైతే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు పేదరికం కూడా దూరం అవుతుందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 138వ జయంతి వేడుక కార్యక్రమం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో పేదరికాన్ని దూరం చేయగలమని, కులం, మతం, వర్గం ఇవేవీ విద్యకు ప్రమాణికాలు కావన్నారు. భారత దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి, భారత రత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విద్యకు ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని స్వతంత్య సమరయోధులుగా, కవిగా, రచయితగా, పాత్రికేయులుగా, విద్యావేత్తగా ఆయన సేవలు చిరస్మరణీయం అన్నారు. కార్యక్రమంలో ముందుగా వేదికను అలంకరించిన ముఖ్య అతిధులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చివరగా మదరసా నిర్వాహకులను, విద్య, ఉద్యోగ, వృత్తిలో ఉన్నత స్థాయికి ఎదిగిన పలువురు ముస్లిం మైనారిటీలను ముఖ్య అతిధులు సత్కరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, వక్ఫ్ బోర్డు డైరెక్టర్లు దావూద్ భాక్షి, బెపారి జకీర్ హుసేన్, ఫాస్టర్ శామ్యూల్ బాబు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి అధికారి హిదాయతుల్లా, మైనారిటీ నాయకులు అమీర్ బాబు, మన్సూర్ అలీ, జిలానీ, మైనారిటీ, మదరసా నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **వైసిపి కార్యాలయంలో..** భారత రత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా కడప నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మేయర్ ముంతాజ్ బేగం పూలమాలవేసి నివాళులర్పించారు. నగర మైనార్టీ అధ్యక్షులు కార్పొరేటర్ మహమ్మద్ షఫీ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, జిల్లా, నగర అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, మహిళ నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీలకు చేసిందేమీ లేదు

ప్రజాశక్తి - కడప : కూటమి అధికారంలోకి వచ్చి 18నెలల కాలంలో మైనారిటీలకు ఏమి చేశారని, మైనారిటీ సంక్షేమ దినోత్సవం జరుపుకునే హక్కు కూడా చంద్రబాబుకు లేదని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు . మంగళవారం తన నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో ఎర్రకోట వద్ద పేలుళ్ల ఘటన బాధాకరమని, దీని వెనుక ఉన్న వారిని ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలని మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు 50ఏళ్ళకే పెన్షన్ ఇస్తామని ప్రకటించిందని, అమరావతిలో హజ్ హౌస్ నిర్మిస్తామని హామీ ఇచ్చి నిర్మించకపోవడం మోసం కాదా అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి అలీ అక్బర్, రాష్ట్ర మైనార్టీ అధికార ప్రతినిధి చాక్లెట్ గౌస్, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షఫీ, నగర మైనారిటీ అధ్యక్షుడు కార్పొరేటర్ మహమ్మద్ షఫీ, రాష్ట్ర వాణిజ్య కార్యదర్శి రాయల్ బాబు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ అవసరం

ప్రజాశక్తి -కాశి నాయన : విద్యార్థులు విద్యతోపాటు స్కిల్స్ చేయడం కూడా నేర్చుకోవడం ఎంతో అవసరమని బి.కోడూరు కస్తూరిబా పాఠశాల ఎస్ఒ శ్రీలత అన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ విద్యార్థులు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కడపలో నిర్వహించిన వృత్తి విద్య పోటీల్లో ప్రతిభను కనబరిచారు. ఫుడ్ ప్రాసెసింగ్ ట్రేడ్‌లో జిల్లా స్థాయిలో మొదటి స్థానానికి ఎంపికై రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఫుడ్ ప్రాసెసింగ్ ఉపాధ్యాయులు వీరపోగు గురమ్మ తెలిపారు. అనంతరం విద్యార్థులను ప్రిన్సిపల్, సిబ్బంది అభినందించారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - కడప : నగరంలోని ఎసిఎ స్టేడియం, కెఒఆర్ఎం స్టేడియాల్లో సౌత్‌జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు కొనసాగుతున్నాయి. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో మంగళవారం కడప నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90.0 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 280 పరుగులు చేసింది. ఆ జట్టులోని శివ చరణ్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 205 బంతులను ఎదుర్కొని 21 బౌండరీల సహాయంతో 151 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. వర్షిత్ కుమార్ 44 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని సనత్ రెడ్డి రెండు, శ్రీ చరణ్ రెండు, గులాం నబి రెండు వికెట్లు తీసుకున్నారు. **మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం 146 ఆలౌట్..** వై.ఎస్. రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో అనంతపురం, చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. మొదట బ్యాటింగ్ చేసిన అనంతపురం జట్టు 54.0 ఓవర్లలో 146 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని పంకజ్ 88 పరుగులు చేశాడు. జట్టులోని మణిదీపు అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి ఐదు వికెట్లు తీసుకున్నాడు. రక్షణ సాయి 2, హఫీజ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 40.1 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 80 పరుగులు చేసింది. ఆ జట్టులోని 46 పరుగులు చేశాడు.

మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్ : జడ్జి

ప్రజాశక్తి - కడప : ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్ అని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం కడప నగరం రిమ్స్ ఆవరణంలో ఉన్న వన్ స్టాప్ సెంటర్‌ను జడ్జి సందర్శించారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు వన్ స్టాప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకే చోట అనేక సేవలు ఇక్కడ లభిస్తాయన్నారు. వన్ స్టాప్ సెంటర్లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్ సహాయం, మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు ఉంటాయిన్నారు.

సేంద్రియ ఎరువులను వినియోగించాలి

ప్రజాశక్తి - కడప సిటీ : సేంద్రియ ఎరువులు వాడకం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమవుతాయని రైతు శిక్షణ కేంద్రం అధికారి సుచిత్ర పేర్కొన్నారు. మంగళవారం ఆమె పాత కడప గ్రామం పొలం పిలుస్తుంది కార్యాక్రమంలో పాల్గొని మాట్లాడారు. భూసారం పెంపుదలకు చర్యలు తీసుకోవాలన్నారు భూమిలో సేంద్రియ పదార్థాలు తక్కువ అవడం వల్ల పంటలు సరిగా దిగుబడి రాదని తెలిపారు. దీనికోసం పశువులు, పచ్చిరొట్ట ఎరువులు ఇతర ఎరువులను తప్పకుండా భూమిలో వాడాలని సూచించారు. తద్వారా అధిక దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. యూరియా వాడకం తగ్గించుకోవాలని, సమగ్ర ఎరువుల యాజమాన్యం ఆచరించాలని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వరిలో వచ్చే కాండంతొలుచు పురుగు మరుగు, ఆకు చుట్టుపరుగు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది కవిత, రాధిక పాల్గొన్నారు.


గోపవరం : గోపవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి విజయరావు మాట్లాడుతూ వరి పంటలో కనిపించే మానిపండు తెగులును ముందుగానే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఘన జీవామృతం తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఓబయ్య, ఎపిసిఎన్ఎఫ్ స్టాఫ్ ఓబులేసు, విజయ్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

16న వనభోజనం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఈ నెల 16న నిర్వహించే తొగటవీర క్షత్రియుల కార్తీక వనభోజనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర అధ్యక్షులు కళ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు కోరారు. సోమవారం ఎర్రముక్కపల్లిలోని సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16న ఉదయం 10 గంటలకు రాజంపేట రోడ్డులోని కనుమలోపల్లి శనీశ్వరాలయం పక్కన ఉన్న 108 శివలింగాల మహాలింగేశ్వర స్వామి సన్నిధిలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు పిల్లలకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించి బహుమతులు అందజేస్తామన్నారు. ముఖ్య అతిథులుగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి హాజరవు తారన్నారు. కుల బాంధవులు కుటుంబ సమేతంగా పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, కోశాధికారి టేకూరి సుదర్శన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లా మురళీకృష్ణయ, ఉపాధ్యక్షులు చౌడం సూరిబాబు, వెలిగండ్ల సుబ్బరాయుడు, బొలిశెట్టి వెంకటస్వామి, దొండ్ల వెంకటరమణ, టేకూరి పుష్పాంగద పాల్గొన్నారు.

అంతర్జాతీయ జర్నల్స్‌కు డాక్టర్ వీరనాగేంద్రకుమార్

ప్రజాశక్తి - కడప



ప్రభుత్వ పురుషుల కళాశాల కడప, జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వీర నాగేంద్ర కుమార్ ప్రముఖ అంతర్జాతీయ జర్నల్స్‌కు ఎంపికయ్యారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రెస్‌తో పాటు 12 అంతర్జాతీయ జర్నల్స్‌కు పరిశోధక వ్యాసాలకు సంబంధించి సమీక్షకుడిగా డాక్టర్ వీర నాగేంద్ర కుమార్ వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ తమ కళాశాల అధ్యాపకుడు అంతర్జాతీయ జర్నల్స్‌కు ఎడిటోరియాల్ సభ్యుడిగా ఎన్నికైనందుకు సంతోషంగా ఉందని తెలిపారు. సందర్భంగా వీర నాగేంద్ర కుమార్‌ను ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిల్ డాక్టర్ రమేష్, అకడమిక్ కో - ఆర్డినేటర్ డాక్టర్ వెంకట సుబ్బయ్య, డాక్టర్ సత్యనారాయణరెడ్డి, డాక్టర్ నాగరాజు, డాక్టర్ నాగేశ్వరరెడ్డి, డాక్టర్ మహేష్, డాక్టర్ సతీష్ రెడ్డి, డాక్టర్ సురేష్, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ నీలయ్య, డాక్టర్ రవి శేఖర్, అధ్యాపకులు అభినందించారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి : ఆవాజ్

ప్రజాశక్తి - బద్వేలు : ఢిల్లీలోని ఎర్రకోటలో బాంబు పేలుడు ఘటనకు కారకులైన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి. చాంద్‌బాషా, బద్వేల్ పట్టణ ఆవాజ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అబ్దుల్ సత్తార్, ఎస్.అన్వర్‌బాషా డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆవాజ్ కమిటీ కార్యాలయంలో సోమవారం దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో సంభవించిన బాంబు పేలుడు ఘటనలో మృతి చెందిన 12 మందికి సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రకోట సమీపంలో ఉన్న వ్యాపార దుకాణాలన్నీ ధ్వంసమయ్యాయని, తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. మృతి చెందిన, గాయపడిన ఒక్కొక్క కుటుంబానికి రూ. కోటి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘటనలో నష్ట పోయిన షాపు యజమానులు, వ్యాపార సంస్థలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు కసరత్తు

- నాలుగింటికి శంకుస్థాపన, రెండు ప్రారంభోత్సవాలు

- 15న విశాఖలో సిఎం చేతుల మీదుగా శంకుస్థాపన

- 4,740 మందికి ఉపాధి అవకాశాలు



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు కసరత్తు ఊపందుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14,15 తేదీల్లో విశాఖపట్నం కేంద్రంగా పెట్టుబడుల సమ్మిట్ ప్రారంభించనున్న సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా జిల్లాలోని కడప నగర సమీపంలోని కొప్పర్తి పారిశ్రామికవాడలో నాలుగు కంపెనీలకు శంకుస్థాపనలు, పెద్దముడియం, కొండాపురం మండలాల్లో ఏర్పాటు చేసిన రెండు సేల్ సోలార్ కంపెనీలు ప్రారంభానికి రంగం సిద్ధమైంది. ఈమేరకు జిల్లా పరిశ్రమల సమాఖ్య కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులోభాగంగా కడప నగర శివారులోని కొప్పర్తి పారిశ్రామికవాడ కేంద్రంగా ఏర్పాటైన రూ.3,941 కోట్లతో ఆంపల్స్ పవన్ విద్యుత్ ప్రాజెక్టు సహా రూ.121 కోట్లతో టెక్నోడోమ్, రూ.75 కోట్లతో అదీప్ లైఫ్ సైన్సెస్ బల్క్‌డ్రగ్, రూ.80 కోట్లతో ఎలక్ట్రానిక్ వస్తువులను ఉత్పత్తి సంబంధిత కంపెనీ ఛానల్ ప్లే కంపెనీలకు విశాఖ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. ఇందులోభాగంగా కొప్పర్తిలోని ఆంపల్స్ పవన్ విద్యుత్ కంపెనీలో 1,030 మందికి, టెక్నోడోమ్‌లో 300 మందికి, అదీప్‌లో 240 మందికి, చానల్ ప్లేలో 1,100 మందికి వెరసి 2,670 మందికి ఉపాధి లభించనుంది. దీంతోపాటు జిల్లాలోని పెద్దముడియం, కొండాపురం మండలాల్లో రూ.3,454 కోట్లతో ఏర్పాటైన రెండు సేల్ సోలార్ కంపెనీల్లో 2,0 70 మందికి వెరసి 4,740 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలుస్తోంది.


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న బీటెక్ రవి

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అన్ని వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని, ప్రతి సమస్యకు పరిష్కారం అందించడమే లక్ష్యమని పులివెందుల టిడిపి ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. పులివెందుల టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని సూచించారు. అవసరమైన సమస్యలను సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పరిశ్రమలతో యువతకు స్వయం ఉపాధి

పులివెందుల పరిశ్రమల ఏర్పాటు అనువైందని, తద్వారా యువతకు స్వయం ఉపాధి దొరుకుతుందని మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. పరిశ్రమల ఆధారిత ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల ప్రాంత యువత పరిశ్రమల దిశగా ముందుకు సాగేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. పరిశ్రమల ద్వారా స్వయం ఉపాధి సృష్టి, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సింహాద్రిపురం మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, రాష్ట్ర ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఉన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర హజ్ హౌస్ డైరెక్టర్ మహబూబ్ బాషా, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, పులివెందుల మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరు వెంకట్రామిరెడ్డి, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఆర్‌డిఓ చిన్నయ్య, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్‌గా నాగేంద్ర

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్ర ఎస్‌టియు కౌన్సిలర్‌గా అంగడి నాగేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వేంపల్లెలోని ఎస్‌ఎన్‌ఆర్ ఫంక్షన్ హాలులో మంగళవారం ఎస్‌టియు 79వ వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పులివెందుల రీజియన్ నుంచి రాష్ట్ర కౌన్సిలర్లుగా అంగడి నాగేంద్ర, ఎస్. దాదాపీర్, విజయభాస్కర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. జిల్లా శాఖలో జిల్లా ఉపాధ్యక్షులుగా ఆలూరు మునిబాబు, జిల్లా ఆడిటర్లు ప్రధాన కార్యదర్శి బివి మహేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శిగా జి మల్లేష్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.శ్రీధర్ రావు ఎన్నికయ్యారు. రీజినల్ కన్వీనర్, కో-కన్వీనర్లుగా ఎ.శివశంకర్‌రెడ్డి, బి. సూర్యనారాయణ రెడ్డి, మైనారిటీ కమిటీ కన్వీనర్‌గా పి.అలీ బాబు, ఉపాధ్యాయ వాణి కన్వీనర్‌గా వి.సూర్యచంద్రారెడ్డిలతో పాటు పలు విభాగాలకు ఎన్నుకున్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ద్వారా దాసరి వర్గ ప్రజలకు ప్రత్యేక సంక్షేమ పథకాలతోపాటు రాయితీ రుణాలు మంజూరు చేయ్యేలా కృషి చేస్తానని ఎపి రాష్ట్ర దాసరి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సొసైటీ డైరెక్టర్ సుబ్బయ్య గోవింద తెలిపారు. ఆయనకు పదవి రావడంతో పుత్తంటెట్టాల్ల గ్రామ పెద్దలు మంగళవారం అభినందించారు. అనంతరం సుబ్బయ్య గోవింద్ మాట్లాడుతూ రాష్ట్ర డైరెక్టర్‌గా తనకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఇందుకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, స్థానిక నాయకులు సహకరించారని తెలిపారు. దాసరి వర్గ ప్రజల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతానన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రతాపరెడ్డి, సంద్యా సుబ్బయ్య యాదవ్, కొరివి కృష్ణమూర్తి పాల్గొన్నారు.


సుబ్బయ్య గోవిందును సన్మానిస్తున్న గ్రామ పెద్దలు


సిబ్బందికి వ్యాక్సిన్ బాక్సులు అందజేస్తున్న వాసా శ్రీనివాస

పశువులకు సకాలంలో టీకాలు వేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

పశువులు, జీవాలకు వచ్చే వ్యాధులకు సకాలంలో టీకాలు వేయాలని ముద్దనూరు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వాసా శ్రీనివాస సిబ్బందికి సూచించారు. స్థానిక పశు వైద్యశాలలో మంగళవారం వాసా శ్రీనివాస ఆధ్వర్యంలో ఎహెచ్‌ఎలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో అప్రమత్తంగా ఉండాలన్నారు. గేదెలు, ఆవులు, దూడలు, మేకలు, గొర్రెలకు సకాలంలో టీకాలు వేయించుకునేలా పాడి రైతులు, పశు యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. టీకాలు తీసుకెళ్లేందుకు కోసం వ్యాక్సిన్ క్యారియర్ బాక్సులు సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ భారతి, జెవిఐ శకుంతలమ్మ, ఎల్‌ఎస్‌ఎ సూర్య బాబు, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

బి.మఠం హుండీ ఆదాయం రూ.35 లక్షలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠంలో మూడు నెలలకు సంబంధించి 6 హుండీలను మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా వచ్చిన ఆదాయం రూ.35,86,181. పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.52,121. గోల్డ్ 70 గ్రాములు 220 మిల్లీ గ్రాములు, సిల్వర్ 450 గ్రాములు వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ పత్తం గురుప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, మఠం మేనేజర్ ఈశ్వరయ్యాచారి, పూర్వపు మఠాధిపతులు పెద్ద కుమారుడు వెంకటాద్రి స్వామి, భక్తులు పాల్గొన్నారు.

విష జ్వరంతో మహిళ మృతి

ప్రజాశక్తి - ముద్దనూరు

11 నెల ఆడ కవల పిల్లలు తల్లి పాలు మరువకముందే ఆ తల్లి విష జ్వరంతో చికిత్స పొందుతూ మృత్యువాత పడింది. తల్లి మృతి చెందడంతో ఆ పిల్లలు పాల కోసం అలమటిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కోడిగాండ్లపల్లె గ్రామానికి చెందిన గంగాదేవి(40) విష జ్వరంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాదేవి, ఆమె భర్త నడిపి సుబ్బరాయుడు వ్యవసాయ కూలీలు.20 రోజుల క్రితం విష జ్వరంతో గంగాదేవి కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఆమెకు 11నెల ఆడ కవల పిల్లలు. గ్రామంలో దోమ కాటు వల్ల కొన్ని నెలల క్రితం మేఘన అనే చిన్నారి చనిపోయిందని స్థానికులు తెలిపారు. గ్రామంలో జ్వరాల బారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని భయాందోళన వ్యక్తం చేశారు. గండికోట జలాశయం వెనుక జలాలు కోడిగాండ్లపల్లెకు ఆనుకుని ఉన్నాయని తెలిపారు. ఆ నీటి వల్ల దోమలు విజృంభిస్తున్నాయని వాపోతున్నారు. విష జ్వరాల మరణాలను నివారించాలని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.


గంగాదేవి (ఫైల్‌ఫోటో)

ఆడపిల్లల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - ఖాజీపేట

ఆడపిల్లల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. మండలంలోని తుడమలదిన్నెలో మంగళవారం బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. మైదుకూరు ప్రాజెక్టు సిడిపిఒ శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ రమణమ్మ మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. భ్రూణ హత్యలు అరికట్టాలన్నారు. ఎంఇఒ నాగ స్వర్ణలత, మెడికల్ ఆఫీసర్ మాధవి, సిబ్బంది బాలికల సంరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. ప్రజాప్రతినిధులు అంగనవాడీ సిబ్బంది పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పులివెందుల ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ శోభారాణి పేర్కొన్నారు. మంగళవారం అంకాలమ్మ గూడూరులో బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ సునీత, సూపర్వైజర్లు లక్ష్మీదేవి, వసంత కుమారి, సర్పంచ్ చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** ఆడ, మగ బిడ్డ అనే వివక్ష తల్లిదండ్రులకు ఉండకూడదని, ఇద్దరూ సమానమేనని డాక్టర్ సాయి చరితరెడ్డి సూచించారు. చిలమకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బేటి బచావో.. బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి చరితరెడ్డి మాట్లాడుతూ ఆడపిల్లల అభివృద్ధికి వారిని బాగా చదివించాలన్నారు. ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఎంఇఒ శివప్రసాద్ మాట్లాడుతూ అమ్మాయిలు చదువుతోపాటు ఆటలలో ముందుండాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తల్లిదండ్రులు అమ్మాయిలకు వివరిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నాగమణిరెడ్డి, హెచ్ఎం పద్మనాభయ్య, అంగన్వాడీ సూపర్వైజర్ ఓబులమ్మ, హెల్త్ సూపర్వైజర్ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు. **వేంపల్లె :** బాల్య వివాహాలను అధికారులు కట్టుదిట్టంగా నివారించాలని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి కోరారు. స్థానిక గ్రామ సచివాలయం-8లో వేంపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి, సిడిపిఒ సునీత, ఎంపిటిసి రహమతుల్లా ఖాన్, వార్డు మెంబర్ బాలరాజు, తాళ్ళపల్లి, వేంపల్లి హెల్త్ సెంటర్స్ వైద్యులు సుభాషిణి, నిహారిక, ఎపిఎం వెంకటేశ్వర రావు, ఎంఇఒ వెంకటరామిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ఎర్రగుంట్ల : మాట్లాడుతున్న డాక్టర్ సాయి చరితరెడ్డి

హైవేపై అనధికార వ్యాపారాలు.. పట్టని అధికారులు

ప్రజాశక్తి - ఖాజీపేట

కడప-కర్నూలు జాతీయ రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఎక్కడోచోట ఏవో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇందుకు మితిమీరిన వాహనాల వేగం, రోడ్డు భద్రత నియమాలు పాటించకపోవడం ఇతరత్రా కారణాలు కావొచ్చు. ఇందులో జాతీయ రహదారి నిర్వహణ కూడా కారణంగా చెప్పవచ్చు. వివరాల్లోకి వెళితే.. ఖాజీపేట-చెన్నూరు మధ్య హైవే రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. కొందరు రహదారికి ఇరువైపులా రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వాహనాలు ఎక్కడ పడతే అక్కడ రోడ్డుపై ఎక్కువ సేపు వాహనాలు నిలపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇలా ఉండడం వల్ల రోడ్డు భద్రతకు ఇబ్బందిగా తయారైంది. హైవే రహదారిని పర్యవేక్షించాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోవట్లేదని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. హైవేపై కొందరు పూల దుకాణాలు ఏర్పాటు చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. కార్లు ఆటోలు, ద్విచక్ర వాహనాలు ప్రధాన హైవే రోడ్డుపై నిలిపి కొనుగోలు చేస్తున్నారు. వీటివల్ల ఇతర వాహన రాకపోకలకు సమస్యగా మారింది. ఇవే కాకుండా హైవే రహదారికి ఇరువైపుల దాబాలు, టిఫెన్ సెంటర్లు, టీ దుకాణాలు విచ్చలవిడిగా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎన్‌ఎఐ అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అనుమతుల్లేని దుకాణాలను ఎందుకు మూసేయించడంలేదని పేర్కొంటున్నారు. హైవేపై ఉన్న దుకాణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నా చర్యలు లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైతుల అభ్యున్నతికి దోహదపడాలి : జెడి


రైతులతో మాట్లాడుతున్న జెడి చంద్రనాయక్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

క్షేత్రస్థాయిలోని సిబ్బంది రైతుల అభ్యున్నతికి దోహదపడాలని జెడి చంద్రనాయక్ సూచించారు. గురజాలలో మంగళవారం మొక్కజొన్న పంట కోత ప్రయోగం, బి.చెర్లోపల్లిలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగంలో దిగుబడి తగ్గినట్లయితే ప్రభుత్వం నుంచి పరిహారం అందించేందుకు నివేదికలు పంపుతామన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొలల్లో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని రైతులకు సూచించారు. దీని ఆధారంగా ఎరువులను వినియోగించుకోవాలన్నారు. మోతాదుకు మించి ఎరువులు వాడితే అనర్థదాయకమన్నారు. కొంతమంది రైతులకు క్రిమిసంహారక మందులు పట్ల అవగాహన లేక అధిక మోతాదులో పిచికారి చేస్తే దిగుబడులు గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. రైతులు కొనుగోలు చేసే ప్రతి ఎరువుకు, క్రిమి సంహారక మందులకు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. యూరియా, ఇతర ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే ఆ డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ముద్దనూరు ఎడి రామ్మోహన్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఎఒ రామాంజనేయరెడ్డి, ఏఈఓ భార్గవ్‌రెడ్డి, వీఆర్వో చంద్రమోహన్, రైతు సేవ కేంద్రం అసిస్టెంట్ రాజీవ్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చక్రాయిపేట : ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చునని వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని నెరుసుపల్లె గ్రామ సచివాలయంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ప్రస్తుతం డ్రోన్ టెక్నాలజీ, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్ ద్వారా తక్కువ నీటి వనరులతో అధిక దిగుబడి సాధించే వివిధ రకాల పంటలు సాగు చేయవచ్చన్నారు. ముఖ్యంగా కూరగాయలు, మామిడి, అరటి పంటల ద్వారా రైతులు అధిక దిగుబడి సాధించాలని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేముల : పెర్నపాడు, గొల్లగూడూరు గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ జిపి ఓబులేసు మాట్లాడుతూ బెంగాల్ గ్రామ్ (శనగ/బుడ్డాశెనగ) పంటలో సాధారణంగా వచ్చే ముఖ్యమైన తెగుళ్లు, వాటి నియంత్రణ పద్ధతుల రైతులకు వివరించారు. సాధారణ పంట నిర్వహణ సమయానికి విత్తడం, కలుపు మొక్కలు తొలగించడం, పంట తర్వాత అవశేషాలను దహనం చేయడం, ఎరువుల సమతుల్యతపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, విఎఎ లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

డిసెంబర్ 31నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖ పట్టణంలో జరుగు సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో మంగళవారం దాసు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికులు ప్రాణాలు తెగించి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్పు చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సిఐటియు ఆల్ ఇండియా మహాసభలకు ప్రత్యేకత ప్రాధాన్యత ఉందన్నారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల మీద రాజీలేని పోరాటాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు వినయ్, సిఐటియు నాయకులు ఆదాము, నరేంద్ర, ప్రసాద్‌రెడ్డి, దస్తగిరి, నాగన్న, మైకేల్, రవి, శివ, చంటి, సుబ్బరాయుడు, చంద్రయుడు, భాగ్యమ్మ, లక్ష్మీదేవి, మేరీ, కృపమ్మ, హెబ్సిబ్బ, రామలక్ష్మమ్మ, హాజీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బి.మనోహర్

ఉన్నతాధికారుల దృష్టికి పొలాల వివరాలు

సింహాద్రిపురం : మండలంలోని పైడిపాలెం రిజర్వాయర్ పరిధిలో జౌకులకు గురవుతున్న పొలాలను మంగళవారం గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ ఎఇ రసూల్ పరిశీలించారు. అహోబిలం గ్రామ పొలాలను పరిశీలించి రైతుల పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎఇ మాట్లాడుతూ రిజర్వాయర్ పరిధిలో నీరు లీకేజీల కారణంగా చాలామంది రైతుల పంట పొలాల్లో నీరు నిల్వ ఉంటోందన్నారు. ఈ కారణంగా వ్యవసాయం చేయడానికి కొంత భూమి వీలు కావడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆయన వివరించారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - వేంపల్లె

అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు దృష్టి పెట్టాలని ఎస్‌పి షేల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు. వేంపల్లె యుజి పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ పాత నేరస్తులు, అనుమానితుల కార్యకలాపాలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలకు వెళ్లి ప్రజలతో ముఖాముఖి సమస్యలు తెలుసుకోవాలన్నారు. వాటిని పరిష్కరించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. గ్రామాల్లో నైట్ హాల్ట్ చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు త్వరితగతిన విచారించి పరిష్కరించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. సమస్యను సావధానంగా విని చట్ట పరిధిలో న్యాయం చేయాలని ఎస్‌పి సిబ్బందికి సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

చక్రాయపేట : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ జె.చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం సాయంత్రం వేంపల్లి-రాయచోటి ప్రధాన రహదారి వీరనారాయణపల్లె క్రాస్ వద్ద ఆయన సిబ్బందితో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మోటర్ వాహన చట్టలను గౌరవించాలన్నారు. వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సును తనిఖీ చేశారు. సక్రమంగాలేని వాహన యజమానులకు జరిమానా విధించారు. వాహనదారులకు పలు సూచనలు చేశారు.

శ్రీచైతన్య యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న శ్రీచైతన్య విద్యాసంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మైదుకూరు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పెరుగుతూ చదువు పేరుతో రూ.లక్షల్లో తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తు న్నారని తెలిపారు. ఎక్కువ మార్కులు రావాలని ఒత్తిడి వల్ల విద్యార్థులు ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న శ్రీచైతన్య విద్యాసంస్థల్లో జశ్వంతి అనే 9 తరగతి విద్యార్థిని అనుమానాస్పదంగా మృతి చెందడంపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. జస్వంతి కి న్యాయం జరిగే వరకూ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు వినయ్‌కుమార్, సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు


ఆర్‌డిఒ కార్యాలయంలో వినతిపత్రమిస్తున్న వైసిపి నాయకులు

రేషన్ పంపిణీలో అక్రమాలను అరికట్టండి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రేషన్ పంపిణీలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని వైసిపి నాయకులు కోరారు. ఆ మేరకు వారు మంగళవారం వైసిపి పట్టణ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ రేషన్ పారదర్శకంగా పంపిణీ జరిగేదన్నారు. కూటమి ప్రభుత్వం వారి మద్దతుదారులకే డీలర్‌షిప్ ఇవ్వడంతో రేషన్ పంపిణీ సక్రమంగా జరగడంలేదన్నారు. పేదల రేషన్ అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. కేవలం రెండు, మూడు రోజులు మాత్రమే పంపిణీ చేస్తు న్నారని. తూకాల్లో కూడా తక్కువ ఇస్తున్నారని ఆరోపించారు. పనులు వదిలి క్యూలైన్లో నిల్చుకొని రేషన్ తీసుకోవాల్సి వస్తోందన్నారు. దీనిపై విచారించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైసిపి పట్టణ అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు చంద్రమౌళి, కౌన్సిలర్లు కిషోర్, కోడి రమణ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో కాంస్య పతకం సాధించిన విద్యార్థి

ప్రజాశక్తి - చాపాడు



రాష్ట్ర స్థాయి మార్షల్ ఆర్ట్స్ క్రీడలో నరహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి డి.ధర్మతేజ బ్రాంచ్ పథకం సాధించినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం కేఎల్ నరసింహ శాస్త్రి తెలిపారు. అనంతపురం జిల్లాలో లక్ష్మి సీనర్జీ పాఠశాలలో ఈనెల 8,9 తేదీల్లో నిర్వహించిన ఎస్‌జిఎఫ్‌ఐ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో కురస్ మార్షల్ ఆర్ట్స్ 40 కిలోల విభాగంలో బ్రాంజ్ పథకం సాధించి సత్తా చాటాడని తెలిపారు. వి.సుబ్బలక్ష్మి (హ్యాండ్ బాల్), కే మస్తాన్ వల్లి, ఎల్ సిద్దార్థి రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొన్నారని తెలిపారు. పథకం సాధించిన ధర్మతేజను పీడీ ప్రశాంతిని ఆయన అభినందించారు.

మాక్ అసెంబ్లీకి పి.వీర ఉదయశ్రీ

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మండలం శెట్టివారిపల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి పి.వీర ఉదయశ్రీ మాక్ అసెంబ్లీకి ఎంపికైంది. మూడు విడతల్లో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి ఈనెల 26న అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో జరగనున్న మాక్ అసెంబ్లీలో పాల్గొనే అవకాశం దక్కించుకుంది. చివరగా ప్రొద్దుటూరు పట్టణంలో ఈనెల 8న జరిగిన పోటీలో మాక్ అసెంబ్లీలో తనకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పాత్రను ఇచ్చారని ఉదయ శ్రీ పేర్కొంది. చట్ట సభల్లో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం కల్పిస్తున్న కూటమి ప్రభుత్వానికి, విద్యాశాఖ మంత్రి లోకేష్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మాక్ అసెంబ్లీలో కూడా మైదుకూరు నియోజకవర్గం పేరు నిలబెట్టేలా ప్రతిభ కనబరుస్తానని, ఆ విధంగా సన్నద్ధం అవుతున్నానని ఉదయ శ్రీ తెలిపింది.


ఆజాద్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు

అబుల్ కలాం ఆజాద్ గొప్ప జాతీయ వాది

ప్రజాశక్తి - వేంపల్లె

భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప రాజనీతిజ్ఞుడు, జాతీయవాదని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, చరిత్రశాఖ ఆధ్వర్యంలో, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేర్వేరుగా అధ్యాపకులు, కాంగ్రెస్ నేతలు మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతిని ఘనంగా నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ ఆధ్వర్యంలో సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని దాదాపు 10 ఏళ్ల పాటు దుర్భర జైలు జీవితాన్ని గడిపిన ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు ఆజాద్ అన్నారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్‌నేతలతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర, అధ్యాపకులు బాలకొండ గంగాధర్, మాధవరావు, నాగ లక్ష్మిదేవి, షఫీ ఉద్దీన్, రాజారెడ్డి, డాక్టర్ సి మల్లేశ్వరమ్మ, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

చాపాడు : 58వ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి ప్రారంభిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి శివశంకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తామన్నారు. గ్రంథాలయంలో ప్రతిరోజు ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పాఠకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. **మైదుకూరులో..** గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రికార్డ్ అసిస్టెంట్ మనోహర్ తెలిపారు.

బాంబు పేలుళ్ల ఘటన అమానవీయం

ప్రజాశక్తి-ఖాజీపేట

ఢిల్లీ ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుళ్ల ఘటన అత్యంత దురదృష్టకరం, అమానవీయమని, ఈ ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫయాజ్ పేర్కొన్నారు. ఆ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ దేశంలో అల్లకల్లోల పరిస్థితులు సృష్టించడానికి ఉగ్రవాదులు, వాటి సంస్థలు ఇలాంటి చర్యలకు పాల్పడడం సిగ్గు చేటన్నారు. ఈ సంఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోవడం, పలువురు గాయపడడం ఆందోళనను కలిగిస్తోందన్నారు.